మోర్తాడ్ నర్సరీలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్న బ్యాగులు





# హరితహారం.. లక్ష్యం @53లక్షలు

- సిద్ధమవుతున్న నర్సరీలు
- పూర్తవుతున్న బ్యాగు ఫిల్లింగ్ పనులు
- గ్రామానికి పది వేల మొక్కలు నాటేలా ప్రణాళిక



నర్సరీలో మొక్కల పెంపకం కోసం మొరాన్ని జాలివడుతున్న కూలీలు

మోర్తాడ్, డిసెంబర్ 13: హరితహారం కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా 530 నర్సరీలు సిద్ధమవుతున్నాయి. ఒక్కో గ్రామానికి పదివేల మొక్కల చొప్పున జిల్లాలో 53లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే మట్టి, ఎరువుల సేకరణ, బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తవుతున్నాయి. విత్తనాలు, స్టంపులు తెప్పించే ఏర్పాట్లలో అధికారులు ఉన్నారు. విత్తనాలు, స్టంపులు రాగానే వారం రోజుల్లో నాటే పనులు కూడా ప్రారంభంకానున్నాయి.

### తుది దశకు బ్యాగ్ ఫిల్లింగ్ పనులు

హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం ఇప్పటికే బ్యాగుల్లో మట్టిని నింపే పనులు పూర్తి కావస్తున్నాయి. మొక్కల పెంపకం కోసం నాణ్యమైన మొరాన్ని సేకరించి నర్సరీ స్థలానికి తరలించి, అక్కడ మొరాన్ని జాలీ పట్టించి, తగినంత సేంద్రియ ఎరువును కలిపి బ్యాగుల్లో నింపే పనులు చేపట్టారు. ఒక్కో నర్సరీలో పదివేల మొక్కలు పెంచేలా మట్టి బ్యాగులను ఏర్పాటు చేస్తున్నారు.

### పూలు, పండ్ల మొక్కలకు ప్రాధాన్యత

హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో పలుసార్లు ఇంటింటికీ తిరిగి ఎలాంటి మొక్కలు నాటుకుంటారు అనే సర్వేల ఆధారంగా పూలమొక్కల పెంపకానికి చర్యలు చేపట్టారు. ఈసారి కానుగ, వేప నీడనిచ్చే చెట్లు, గులాబీ, మందార, గన్నేరు పూలమొక్కలు, జామ, సీతాఫలం, ఉసిరి పండ్ల మొక్కలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు విత్తనాలు, స్టంపుల సేకరణ చేపడుతున్నారు.



## 53లక్షల మొక్కలు లక్ష్యం

జిల్లాలోని 530 గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో 53లక్షల మొక్కల పెంపకానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. రానున్న హరితహారం కార్యక్రమానికి గ్రామానికి పదివేల మొక్కలు నాటడమే లక్ష్యంగా నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. వానకాలం వరకు మొక్కలు సిద్ధమయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తికావస్తుండడంతో విత్తనాల సేకరణలో అధికారులు ఉన్నారు. వారం రోజుల్లో విత్తనాలు బ్యాగుల్లో నాటడం, వాటరింగ్ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నెలాఖరు వరకు అన్ని నర్సరీల్లో విత్తనాలు నాటే కార్యక్రమం కూడా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

## నెలాఖరు వరకు పనులు పూర్తి చేస్తాం



ఇప్పటికే మొక్కల పెంపకం కోసం బ్యాగుల్లో మట్టి నింపే పనులు పూర్తయ్యాయి. విత్తనాల సేకరణ చేయాలని కార్యదర్శులకు సూచించాం. విత్తనాలు రాగానే ప్రాసెసింగ్ చేయించి నాటే కార్యక్రమం కొనసాగుతుంది. ఈ నెలాఖరు వరకు అన్ని నర్సరీల్లో విత్తనాలు, స్టంపులు నాటే కార్యక్రమాలు పూర్తయ్యేలా చూస్తాం. గ్రామానికి పదివేల మొక్కలు నాటే లక్ష్యంతో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నాం.

**- శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, మోర్తాడ్**





కోటగిరి జడ్పీ హైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు

# ఆత్మరక్షణకు కరాటే..

- 8 నుంచి పదో తరగతి బాలికలకు తర్ఫీదు
- 33 రోజులపాటు కార్యక్రమం

కోటగిరి, డిసెంబర్ 13: ఆత్మరక్షణ కోసం బాలికలకు కరాటే శిక్షణ ఇప్పించేందుకు రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ పేరుతో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సన్నాహాలు చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా - పాఠశాలల్లో నవంబర్ 1 నుంచి శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఒక్కో మండలం నుంచి 4,5 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి 8 నుంచి పదో తరగతి వరకు బాలికలకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇస్తున్నారు. జనవరి 23 వరకు ఈ కరాటే శిక్షణ కొనసాగనున్నది. నిజామాబాద్ జిల్లాలో జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఇందుకోసం ఎంపిక చేశారు. మూడు నెలల కాల పరిమితిలో 33 రోజులు శిక్షణ జరిగేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉదయం , సాయంత్రం వేళల్లో గంట పాటు బాలికలకు ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం తదితర విషయాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీని ఎంపిక చేశారని కోటగిరి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. కరాటే శిక్షణ బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని వివరించారు.

### భయాన్ని దరి చేరనివ్వదు..



అనూహ్య పరిణామాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు కరాటే ఉపయోగపడుతంది. ఒంటరి వారమన్న భయాన్ని దరి చేరనివ్వదు. ఆపద సమయాల్లో నీడలా వెన్నంటి ఉంటుంది. శ్రద్ధతో సాధన చేస్తే నిర్భయంగా ఉండవచ్చు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గొప్పగా భావిస్తున్నాం. స్వీయ రక్షణకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

**- వైష్ణవి, 10వ తరగతి, కేజీబీవీ, కోటగిరి**

### చేతిలో ఆయుధం ఉన్నట్లే..



కరాటే సాధన చేస్తే చేతిలో ఆయుధం ఉన్నట్లే. దాడుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఈ విద్యపై ఇప్పుడిప్పుడే అవగాహన పెంచుకుంటున్నాం. మా కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సవిత ప్రోత్సాహంతో మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నాం. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లోనే శిక్షణ ఇస్తున్నారు. అందరికీ అవకాశం కల్పిస్తే బాగుంటుంది.

**-రమ్య, 9వ తరగతి, కస్తూర్బా గాంధీ పాఠశాల, కోటగిరి**